

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

## నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

### గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 20 : టీఎస్ పాస్ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తేనే భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తామని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతుల మంజూరు కోసం కంచరకుంట, బాలసముద్రం, పోచమ్మమైదాన్, దేశాయిపేట, ఓ సిటీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌బీపాస్‌లో సమర్పించిన ప్లాన్ ప్రకారమే క్షేత్రస్థాయిలో నిర్మాణాలు చేపట్టాలన్నారు. సెట్‌బ్యాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరూ కూడా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టకూడదని అన్నారు. టీఎస్ బీపాస్ ద్వారా ధరఖాస్తులు చేసుకుంటే నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సుష్మ, బషీర్ ఉన్నారు.

## ఎమ్మెల్సీ పోచంపల్లి పరామర్శ

నయీంనగర్, అక్టోబర్ 20: కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ సంగాని మల్లేశ్వర్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన తండ్రి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించిన సందర్భంగా హనుమకొండలోని ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



వీరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి

## మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎంహెచ్‌పీఎస్ నాయకులు

ధర్మసాగర్, అక్టోబర్ 20: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ శుక్రవారం ఆర్థికశాఖ, వైద్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. పలువురు ఎంహెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్ రావుతో మైస ఉపేందర్

## అంబేద్కర్ కమ్యూనిటీహాల్ ప్రారంభం

మడికొండ, అక్టోబర్ 20: నగరంలోని 63వ డివిజన్ తిలక్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌ను శుక్రవారం మిట్టపల్లి రవీందర్, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, డివిజన్ అధ్యక్షుడు బెదరకోట రంజిత్ కుమార్, మైనార్టీ నాయకుడు ఎండీ సోనీ, పసునూరి మనోహర్ కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తిలక్‌నగర్ కాలనీ వాసులు విష్ణుమూర్తి, కొట్టె అనిల్, మహేందర్, సింగారపు రమేశ్, వేణు పాల్గొన్నారు.



కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న స్థానికులు

# కెప్టెన్‌ను కలిసిన హోం మంత్రి

హనుమకొండ, అక్టోబర్ 20: రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ శుక్రవారం మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వీలక్ష్మీకాంతరావును హనుమకొండ హంటర్ రోడ్ లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నివాసానికి వచ్చిన హోమ్ మంత్రికి కెప్టెన్, వారి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. హోమ్ మంత్రిని కెప్టెన్ ఇంట్లో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ కలిశారు. కెప్టెన్ నివాసంలో ప్రారంభమైన దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో హోమ్ మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం మధ్య హోమ్ మంత్రికి కెప్టెన్ కుటుంబ సభ్యులు వస్త్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలని, ముఖ్యమంత్రిగా కేసీఆర్‌గా మరోసారి పగ్గాలు చేపట్టాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని, ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. కెప్టెన్ కుటుంబ సభ్యులు వొడితల సరోజినీదేవి, డాక్టర్ షమిత, వొడితల ఇంద్రనీల్, డాక్టర్ శంసిత హోమ్ మంత్రికి స్వాగతం పలికారు. హోం మంత్రిని కలిసిన వారిలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, పలువురు మైనారిటీ నాయకులు ఉన్నారు.



హోమ్ మంత్రి మహమూద్ అలీకి వస్త్రాలను అందజేస్తున్న కెప్టెన్ కుటుంబ సభ్యులు

## ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

### రూ.16,030 స్వాధీనం

ఖిలావరంగల్, అక్టోబర్ 20: పేక ఆడుతున్న ఏడుగురిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. ఖిలావరంగల్‌లో శుక్రవారం పేక ఆడుతున్నట్లు వచ్చిన విశ్వాసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ పీ రమేశ్, ఎస్సై వీ లవన్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఖిలావరంగల్ హనుమాన్‌వీధికి చెందిన తోటకూరి లక్ష్మణ్, బొల్లం రాకేశ్, వడ్లం రాకేశ్, బండారి యుగేంధర్, బొల్లం ప్రేమ్‌సాగర్, గార్ల హరీశ్, విద్యానగర్‌కు చెందిన గండ్ర హరీశ్‌ను అదుపులోకి తీసుకొని, వీరి నుంచి రూ. 16,030 నగదు, ఏడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరొకరు పరారీలో ఉన్నట్లు ఏసీపీ వెల్లడించారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఎల్కతుర్తి, అక్టోబర్ 20: మండలంలోని దామెరకు చెందిన పచ్చిమట్ల రమేశ్ శుక్రవారం తాటిచెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రమేశ్ వృత్తిలో భాగంగా ఉదయం తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింది పడ్డాడు. దీంతో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే 108కు సమాచారం అందించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రమేశ్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

# పారదర్శకంగా ఈవీఎంల ర్యాండమైజేషన్

### కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, అక్టోబర్ 20: వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టినట్లు తెలిపారు. మొదటి దశ ర్యాండమైజేషన్ సంబంధించి హార్డ్‌కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామని, నియోజకవర్గ కేంద్రంలోని స్ట్రాంగ్ రూం తరలించే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేస్తామని అన్నారు. హనుమకొండ జిల్లాలో పరకాల, వరంగల్ పశ్చిమ రెండు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో 1034 బ్యాలెట్ యూనిట్లు, 800 కంట్రోల్ యూనిట్లు, 785 వీవీ ప్యాట్ అందుబాటులో ఉన్నాయని సిక్తా పట్నాయక్ తెలిపారు. రెండు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అవసరం ఉన్న బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లుకు 25 శాతం, వివిప్యాట్‌లు 40 శాతం అదనంగా కేటాయించడం జరుగుతుందని, వీటిని కలిపి ర్యాండమైజేషన్ చేస్తామని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ర్యాండమైజేషన్ చేశామని అన్నారు. మన దేశంలో ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయని, వాటిలో ప్రజ అభీష్టం మేరకు వివిధ పక్షాలకు చెందిన అభ్యర్థులు విజయం సాధించారని అన్నారు. ఈవీఎం యంత్రాలపై అనవసరపు వదంతులు, అపోహలు ప్రచారం అవుతున్న నేపథ్యంలో మరింత పారదర్శకత కోసం ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ ప్రారంభించిందని తెలిపారు. ఏ ఈవీఎం యంత్రం ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో వెళ్తుందో ఆన్‌లైన్‌లో ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ మాత్రమే నిర్దేశిస్తుందని ఆమె స్పష్టం చేశారు. అభ్యర్థులు నామినేషన్స్ దాఖాలు చేసేటప్పుడు ఫారం 26 ని జాగ్రత్త గా నింపాలన్నారు. ఫారంలో పేర్కొన్న ఖాళీలను పూర్తిగా నింపాలని అన్నారు. ఎన్నికల కమిషన్ నూతన ఓటరు నమోదు గడువు అక్టోబర్ 30 వరకు నిర్దేశించిందని, ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులు ఉంటే వెంటనే పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఆర్డీవో రమేశ్ పాల్గొన్నారు.

# వరాలిచ్చే మహాలక్ష్మి

### లక్ష్మీ సహస్ర యాగంలో దేవనాథ జీయర్ స్వామి

హనుమకొండ, అక్టోబర్ 20: శరన్నవరాత్రుల్లో మహాలక్ష్మి వరాలు ఇస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో కొలిస్తే అన్ని సమకూర్చుతుందని దేవనాథ రామానుజ జీయర్ స్వామి భక్తులకు ఉద్బోధించారు. హనుమకొండ నగరంలోని ఎక్సైజ్‌కాలనీలో శ్రీకర విజయవల్లి దేవసేన శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా శుక్రవారం అగ్రతి గజానన మండలి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించిన లక్ష్మి సహస్ర మహాయాగం పూర్ణాహుతిలో రామానుజ జీయర్ స్వామి పాల్గొన్నారు. సౌమిత్రి లక్ష్మణాచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన యాగంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ శ్రీ యాగం అమ్మవారి సహస్ర నామాల మహాయాగం ఈ నగరంలో జరగడం ఎంతో శుభ పరిణామం అన్నారు. కానీ భక్తిశ్రద్ధలను వీడక తనను ఆచరించే వారికి సకల సైభాగ్యాలను, కోరిన వరాలు ఇస్తుందని స్వామి ఆకాక్షిస్తూ మంగళశాసనం చేశారు. వరంగల్ నగర చరిత్రలో తొలిసారిగ మహా లక్ష్మి సహస్ర యాగం నిర్వహించినట్లు నిర్వాహకులు సౌమిత్రి లక్ష్మణాచార్యులు అన్నారు. ఈ గ పూర్ణాహుతిలో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. రామల సునిత, దుగ్యాల మనోహర్‌రావు, డాక్టర్ బీ భాస్కర్, జి.వివేక్, రాజ సుధాకర్‌రెడ్డి, డీ జయశంకర్ విస్తృత ఏర్పాట్లు చేశారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న దేవనాథ రామానుజ జీయర్ స్వామి

# ఎంజీఎంలో బతుకమ్మ వేడుకలు

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 20: ఎంజీఎం దవాఖాన ప్రాంగణంలో శుక్రవారం రాత్రి టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో దవాఖానకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సందడి చేశారు. కాగా, మహిళలకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో ఎంజీఎం దవాఖాన సూరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న టీఎన్జీవోస్ నాయకులు